బోనం.. వైభవం

- విద్యుత్ దీపాలు, పూలతో ఆలయాల అలంకరణ
- పాఠశాలల్లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు


పోతరాజుల వేషధారణలో విద్యార్థులు


బచ్‌పన్ అకడమిక్ హైట్స్‌లో..


కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..


బోనాలు ఎత్తుకున్న విద్యార్థులు

రామంతాపూర్ : హబ్సిగూడ, రామంతాపూర్ పరిధిలో 28, 29 తేదీల్లో (ఆదివారం, సోమవారం) నిర్వహించే బోనాల పండుగకు ఓల్డ్ రామంతాపూర్‌లోని మహంకాళి నల్లపోచమ్మ, రక్తమైసమ్మ, ఊర పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ దేవాలయాలతో పాటు నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయాలను విద్యుత్‌దీపాలు పుష్పాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బోనాల పండుగను పురస్కరించుకుని రామంతాపూర్ పరిధిలోని పలు పాఠశాలల్లో గత రెండ్రోజులుగా విద్యార్థులచే బోనాల పండుగను నిర్వహించారు. పోతరాజులుగా వివిధ అమ్మవార్ల వేషధారణలో ఆకట్టుకున్నారు.

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో శనివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమమీనన్ తదితరులున్నారు.

◆ బచ్‌పన్ అకడమిక్ హైట్స్ స్కూల్లో పాఠశాల డైరెక్టర్ శివకుమార్, కరస్పాండెంట్ కల్పన, ప్రధానోపాధ్యాయురాలు సరిత పాల్గొన్నారు.

మౌలాలి : ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పోచమ్మ దేవాలయానికి కృష్ణవేణి పాఠశాల బోనం సమర్పించారు. పాఠశాల డైరెక్టర్ చంద్రమౌళి, ప్రిన్సిపాల్ జాన్ సురేష్ బాబు, ఉపాధ్యాయులున్నారు.

◆ రెయిన్‌బో పాఠశాలలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ గౌసియాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



బోడుప్పల్: దశల వారీగా అన్ని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్ కాలనీ కమాన్‌ను డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ సొంత నిధులతో ఏర్పాటు చేయగా.. శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ మరమ్మతులు, పైపులైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు నిధులు కేటాయించినట్లు వివరించారు. త్వరలోనే అన్ని డివిజన్లలో పనులు ప్రారంభిస్తామన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరప్ప, న్యూ భవానీనగర్ కాలనీ అధ్యక్షులు సంతోష్, ఉపాధ్యక్షులు సాయిబాబా, ప్రధాన కార్యదర్శి సంపత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి


సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఉప్పల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రెవరెండ్ బ్రదర్ జాన్ కలరికల్ అన్నారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 'మౌంట్ పోర్ట్ లిట్ ఫెస్ట్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్రదర్ జాన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ రేవరెండ్ బ్రదర్ జోసఫ్ పసల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాప్రా : ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ శనివారం కాప్రా డివిజన్‌లో పర్యటించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. వివిధ కాలనీలో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్ మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా పెండింగ్ పనులు ఉన్నాయని, వీటి ద్వారా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పనులను పూర్తి చేసి నిధులు మంజూరు చేయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. డీసీ ముకుందరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజు, ఈఈ హరిలాల్, ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

ఉప్పల్: భార్యభర్తల మధ్య గొడవలతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణేష్‌నగర్‌లో నివాసం ఉండే సురేందర్ (46) ప్రైవేటు ఉద్యోగి. కాగా భార్యభర్తల తరచూ గొడవలు జరుగుతుండేవి. మద్యానికి బానిసైన అతడు 26న మద్యం మత్తులో భార్యతో గొడవపడి, వెంట తెచ్చుకున్న పురుగుల మందు అన్నంలో కలుపుకొని తిన్నాడు. గమనించిన ఆమె భర్త సోదరుడు చక్రపాణికి సమాచారం ఇచ్చింది. చికిత్స నిమిత్తం బైక్‌పై సురేందర్‌ను ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకానగర్‌లో నివాసం ఉండే యాదిరెడ్డికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రేమేశ్వర్‌రెడ్డి (35) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఇంటి యజమాని తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఇంటికి చేరుకున్న యాదిరెడ్డి కుమారుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందాడని చెప్పారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడు..

కుషాయిగూడ: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్‌రావునగర్‌లో నివసిస్తున్న అభిలాష్ (24) 2021 లో బ్లెస్సీ హెలెన్‌ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో 2022లో విడాకులు తీసుకున్నారు. ఈ ఘటనతో అభిలాష్ మానసికంగా కుంగిపోయాడు. మద్యానికి బానిసై శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కిటికీ లోంచి గమనించిన తల్లి సుకన్య స్థానికుల సాయంతో వెళ్లి చూడగా.. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.25 వేల జరిమానా..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని మిక్చర్ దుకాణానికి మల్కాజిగిరి సర్కిల్ శానిటరీ విభాగం జరిమానా విధించింది. గత కొద్ది రోజులుగా మిక్చర్ దుకాణంలో తినుబండారాలు తయారు చేసి మిగిలిపోయిన వ్యర్థాలను డ్రైనేజీలో పారవేయడంతో డ్రైనేజీ నిండి రోడ్డుపై పారుతోంది. శనివారం వ్యర్థాలతో డ్రైనేజీ రోడ్డు మీదకు వచ్చి ఆయిల్ తేలడంతో కొంతమంది వాహనదారులు కింద పడిపోయారు. గమనించిన స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తనిఖీలు నిర్వహించిన శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ దుకాణ యజమానికి రూ.25 వేల జరిమానా విధించారు.

చెట్టు కొట్టిన వ్యక్తికి..

బోడుప్పల్ : ఈస్ట్ హనుమాన్‌నగర్‌లో అనుమతి లేకుండా చెట్టు కొట్టిన జితేందర్‌రెడ్డికి మున్సిపల్ అధికారులు రూ.15వేల జరిమానా విధించారు. చెట్టును కొడుతుండగా.. స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి జరిమానా విధించామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎవరైనా చెట్లు కొడితే వారిపై జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

మేడిపల్లి: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న సాకిడి అనిల్‌కుమార్ (41) సికింద్రాబాద్‌లో పాలదుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా ఈనెల 24న రోజుమాదిరిగానే ఉదయం 5 గంటలకు పాలదుకాణానికి వెళ్లిన అనిల్‌కుమార్ తిరిగి రాలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఉపాధ్యాయుడు..

చెంగిచెర్లలో నివాసం ఉంటున్న వంగవీర రఘు (52) భువనగిరి యాదాద్రి జిల్లా అనంతారంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 22న ఇంటినుంచి పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై వీధి కుక్క దాడి

మల్కాజిగిరి: విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిపై వీధి కుక్క దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కృపాకాంప్లెక్స్ ప్రాంతంలో శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలు కమలమ్మ కుర్చున్న చోటుకి వీధికుక్క వచ్చి ఆమె కాళ్లపై దాడి చేసింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శ్రవణ్ ప్రాథమిక చికిత్స చేయించారు. ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

కార్పొరేటర్ శిరీషారెడ్డికి పితృవియోగం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి తండ్రి అల్లాడి నరసింహారెడ్డి మృతిచెందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.

సీఎంను కలిసిన కార్పొరేటర్

కాప్రా: సీఎం రేవంత్‌రెడ్డిని కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కలిశారు. అసెంబ్లీలో 2024–25 రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్‌కు కేటాయింపులపై హర్షం వ్యక్తం చేస్తూ.. కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ. 3,065 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులతో గ్రేటర్ పరిధిలోని ఆయా డివిజన్లలో పెండింగ్ పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజాపాలనలో సమస్యలు పరిష్కరిస్తూ.. అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు.

కేటీఆర్‌ను కలిసిన స్థానిక నేతలు

మేడిపల్లి: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌ను శనివారం పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లతో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 9న జరగబోయే అవిశ్వాస తీర్మానం, పార్టీ బలోపేతంపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారన్నారు. కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లోని లిల్లీ మోడల్ హైస్కూల్, లల్లీ కిడ్స్, జీహెచ్‌ఎంసీ, వైద్య సిబ్బంది సంయుక్తాధ్వర్యంలో శనివారం డెంగీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ షేక్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ నుండి రక్షణ మన చేతుల్లోనే ఉందని, ఇంటి చుట్టుపక్కల మురుగు, పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల నియంత్రణకు మందులు, దోమ తెరలు ఉపయోగించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, స్వామి, ఉపాధ్యాయులు అజ్రా, రాధా, జీవన్‌బాబు, అహ్మద్, పోలీసులు తదితరులున్నారు.